క్లుప్తంగా

ఆర్జీ–3 జీఎం ఆధ్వర్యంలో బిక్ష



జీఎంతో హనుమాన్ భక్తులు

రామగిరి: మండలంలోని పన్నూర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ఆర్జీ–3 జీఎం దంపతులు ఎస్.అలివేణి సుధాకర్‌రావు హనుమాన్ భక్తులకు బిక్ష ఏర్పాటు చేశారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం బిక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ భక్తులు జీఎం దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో హనుమాన్ భక్తులు పెరుమాండ్ల ప్రసాద్, శ్రీనివాస్, సందీప్, తిరుపతి, రవి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

సుల్తానాబాద్: పట్టణంలోని పలు ఆలయాల్లో సంకష్టహర చతుర్థి చంద్రోదయ సందర్భంగా మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం రాత్రి ఉపవాసాలు ముగించారు. పూజల అనంతరం పూజారులు రమేశ్‌శర్మ, మహేశ్ తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేయాలి



వినతిపత్రం ఇస్తున్న సతీశ్

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ పరిధిలో పైప్‌లైన్ ద్వారా ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేయాలని రామగుండం కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్‌కు కాంగ్రెస్ అధికార ప్రతినిధి సతీశ్ వినతిపత్రం అందించాడు. కార్పొరేషన్ పరిధిలో గ్యాస్ సరఫరా చేసేందుకు పైప్‌లైన్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కార్పొరేషన్ పరిధిలోని 14వ డివిజన్ ఐటీసీఎల్ గ్యాస్ స్టేషన్‌కి సమీపాన ఉంటుందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్



విద్యార్థులతో వలంటీర్లు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లిలో కలెక్టర్ ఆదేశాల మేరకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్ ఆదివారంతో ముగిసింది. ఇరవైమూడు రోజుల నుంచి క్యాంపు నిర్వహించారు. క్యాంప్ నిర్వహణకు సహకరించిన విద్యార్థుల తల్లిదండ్రులకు వలంటీర్లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అనిల్, అక్షిత, హరీశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేత్రదాత కుటుంబ సభ్యులకు అభినందన



అభినందిస్తున్న రామకృష్ణారెడ్డి

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన పెరటి అహల్యమ్మ ఇటీవల మృతి చెందారు. కాగా ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అహల్యమ్మ నివాసంలో సంస్మరణ సభ ఏర్పాటు చేసి కుటుంబ సభ్యులను అభినందించారు. కమాన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణారెడ్డి, నల్లవెల్లి శంకర్, అనంత రాములు, రాజమహేందర్‌రెడ్డి, అనంతరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ధర్మారం: మండలంలోని ధర్మారం, మల్లాపూర్, కొత్తూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం 7 గంటల నుంచి 11 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ధర్మారం అదనపు సహాయక ఇంజనీర్ ఖాన్ తెలిపారు. ఎండపల్లి 132కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లు.. లూజ్ వైర్లు



రత్నాపూర్‌లో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



ఒకవైపునకు ఒరిగిన విద్యుత్ స్తంభం

- రైతులు, ప్రజలకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు

రామగిరి: అధికారుల నిర్లక్ష్యంతో కంచెలు ఏర్పాటు చేయని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. రైతులు పంటపొలాల వద్ద, గ్రామాల్లో విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కానీ వాటి చుట్టూ కంచె వేయడం మరిచారు. మండలంలోని చాలా చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె లేకపోవడంతో పాటు వాటి కొరకు ఏర్పాటు చేసిన దిమ్మెలు సైతం చాలా తక్కువ ఎత్తులో ఉన్నాయి. మరికొన్ని చోట్ల దిమ్మెలు శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. మండల పరిధిలోని రత్నాపూర్ గ్రామంలో పల్లె వీధి నుంచి శ్రీరాంసాగర్ కాలువకు వెళ్లే దారిలో రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కూలిపోయి శిథిలావస్థకు చేరింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ ఎప్పుడు పడిపోతుందో తెలియక రైతులు భయాందోళనకు గురవుతున్నారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కిందపడకుండా తాత్కాలికంగా బండలతో సపోర్టు ఏర్పాటు చేశారు. అలాగే పలు విద్యుత్ స్తంభాలు, లైన్లు కిందికి వేలాడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.

ఇబ్బందుల్లో ప్రజలు, రైతులు

మండలంలోని పలు గ్రామాల్లో రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రజలు, రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. చాలా గ్రామాల్లో నిత్యం ప్రజలు తిరిగే ప్రాంతాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. తక్కువ ఎత్తులో ఉండటంతో పాటు రక్షణ లేకపోవడంతో పశువులు మృత్యువాత పడే ప్రమాదం నెలకొంది. గతంలో పలు సంఘటనలు చోటు చేసుకున్నాయి. పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని గ్రామాల్లో, పంట పొలాల వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి రక్షణగా కంచెలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అలాగే శిథిలావస్థలో ఉన్న దిమ్మెలకు మరమ్మతు చేయాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం ఐతరాజుపల్లి గ్రామాల్లో ఆదివారం హనుమాన్‌నగర్‌కు చెందిన కాలనీవాసులు పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇంటికో బోనం చొప్పున పోచమ్మ సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.



మహిళలతో ఎమ్మెల్యే విజయరమణారావు

శివపల్లి నుంచి తిరుపతికి సైకిల్‌యాత్ర



సైకిల్‌యాత్ర ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

- కాంగ్రెస్ అభిమాని మొక్కు యాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు: అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దపల్లి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి చింతకుంట విజయరమణారావు గెలిస్తే ఎలిగేడు మండలం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానం వరకు సైకిల్‌పై వెళ్తానని ఓ కాంగ్రెస్ అభిమాని మొక్కుకున్నాడు. ఎమ్మెల్యేగా చింతకుంట విజయరమణారావు మెజార్టీతో గెలుపొందడంతో మొక్కిన మొక్కు తీర్చుకునేందుకు ఆ అభిమాన కార్యకర్త సైకిల్ యాత్రను ప్రారంభించాడు. ఎలిగేడు మండలం లాలపల్లికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త, విజయరమణారావు వీరాభిమాని చిగుర్ల జగ్గయ్య ఆదివారం ఎమ్మెల్యే స్వగృహం నుంచి సైకిల్‌యాత్రను ప్రారంభించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, పెద్ది కుమార్, కొప్పెర తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేషనల్ ఒలింపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

జ్యోతినగర్: జాతీయస్థాయిలో నిర్వహించిన సెమ్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో విశ్వభారతి విద్యార్థులు లెవెల్–1, 2 పరీక్షల్లో ప్రతిభ చూపి జాతీయ, రాష్ట్ర స్థాయి మార్కులు సాధించారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని విశ్వభారతి హైస్కూల్ విద్యార్థులు సెమ్స్ ఒలంపియాడ్‌లో వెంకటరమణారావు (8వ తరగతి) జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు, రాజ్‌కుమార్ (తొమ్మిదో తరగతి) జాతీయ స్థాయిలో మూడో ర్యాంకు, వివేష్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్, నిక్షిప్త స్టేట్ ఐదో ర్యాంకు, సమీక్ష సర్కార్ స్టేట్ 8వ ర్యాంకు సాధించారు. ర్యాంకులను జాతీయ కన్వీనర్ అరుకాల రామచంద్రారెడ్డి ప్రకటించారు. అత్యధిక మార్కులు సాధించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ బందారపు యాదగిరి గౌడ్, హెచ్ఎం తిరుపతి, ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

తహసీల్దార్ చాంబర్‌లో ఊడిపడ్డ పెచ్చులు

- తృటిలో తప్పిన ప్రమాదం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయంపై ఉన్న పెచ్చులు ఊడిపడ్డాయి. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డికి తృటిలో పెను ప్రమాదం తప్పింది. తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి కూర్చుండే చాంబర్ పైకప్పు ఒకేసారి పెచ్చులు ఊడిపడ్డాయి. కుర్చీ పక్కన పడడంతో పెను ప్రమాదం తప్పిందని సిబ్బంది తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో విధుల నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో తహసీల్దార్ ఛాంబర్‌పై ఒకేసారి పెచ్చులు ఊడిపడడంతో సిబ్బంది ఆందోళన చెందారు. శనివారం కావడంతో ప్రజలు కార్యాలయానికి వచ్చే తాకిడి లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని ఉద్యోగులు అంటున్నారు. ఆదివారం కార్మికులను పిలిపించి మరమ్మతు చేయిస్తున్నట్లు ఉద్యోగులు తెలిపారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

ఎలిగేడు: మండలంలోని ధూళికట్ట, ఎలిగేడు సహకార సంఘాల్లో సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఎలిగేడు మండల వ్యవసాయ శాఖ అధికారి ఎం.ఉమాపతి తెలిపారు. జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌తో ఎలిగేడు, ధూళికట్ట సహకార సంఘాల్లో 27 నుంచి సంప్రదించాలని సూచించారు. ఒక్కో జీలుగ బస్తా 30కిలోలు సబ్సిడీ మినహాయిస్తే రైతు ధర రూ.1086 ఉంటుందని, ఒక బస్తా మూడెకరాలకు సరిపోతుందని వివరించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పాలకుర్తి: 1998–99 బ్యాచ్ విద్యార్థులు



ధర్మారం: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



రామగిరి: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



పెద్దపల్లిరూరల్: అప్పన్నపేటలో..

రామగిరి: మండలంలోని కల్వచర్ల జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–05లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం మాజీ సర్పంచ్ గంట పద్మ, ఎంపీటీసీ కొట్టె సందీప్, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్‌రావు, ధర్మయ్య, రమేశ్, పద్మలత, శోభన్‌రాజు, పూర్వ విద్యార్థులు మెట్టు వినోద్, ఐతం కుమార్, చెల్పూరి రాజశేఖర్, రేండ్ల శ్రీనాథ్, మైదం శ్రావణ్, కొప్పుల రాము, రోడ్డ విజయ్, గండి మంగ, శ్రీలత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ 1998–99బ్యాచ్..

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ జెడ్పీ హైస్కూల్లో 1998–99లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. చదువు చెప్పిన గురువులను సన్మానించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు యుగందర్, మాధవరెడ్డి, స్వామిదాస్, కుమారస్వామి, గోవర్ధన్, మల్లేశం, తబిత, వనజ, విజయసేనారెడ్డి, రామాచారి, రాంరెడ్డి, సత్యనారాయణ, శశికాంత్‌రెడ్డి, రఘుపతిరావు, పూర్వ విద్యార్థులు ప్రవీణ్, దేవేందర్, డాక్టర్ శ్రీనివాస్, సదానందం, రాజేందర్, రవి, రమేశ్, చంద్రకళ పాల్గొన్నారు.

ధర్మారంలో 2007–08బ్యాచ్..

ధర్మారం: మండల కేంద్రంలోని ప్రతిభ అధ్యయన కేంద్రంలో ఆదివారం 2007–08లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి చదువు చెప్పిన గురువులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. గురువులు బండారి గోపాల్‌కిషన్, సుజాత, మహమ్మద్ ముస్తఫా, శంకరయ్య, భాస్కర్, తిరుపతి, భూమయ్య, సతీశ్, కరుణాకర్, శ్రావణిని సన్మానించారు.

బసంత్‌నగర్ 1998–99 బ్యాచ్..

పాలకుర్తి: బసంత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1998–99 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన గురువులను సన్మానించారు. తువ్వ సతీశ్‌యాదవ్, అరుకాల సతీశ్, తాటిపాముల శేఖర్, చిప్ప సదానందం, చిప్ప మల్లేశ్, బత్తుల కుమార్, పల్లె కమలాకర్, వేముల మమత పాల్గొన్నారు.

అప్పన్న పేట ప్రభుత్వ పాఠశాలలో..

పెద్దపల్లిరూరల్: పదో తరగతి పాసైన 24 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులంతా కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పెద్దపల్లి మండలం అప్పన్నపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం కార్యక్రమం నిర్వహించారు. తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులు పురుషోత్తం, జీవన్‌రాజు, రవీందర్, చంద్రయ్య, సత్తయ్య, రామ్మోహన్‌ను సత్కరించారు.



కాల్వశ్రీరాంపూర్: 1998–99 బ్యాచ్ విద్యార్థులు

వాణి విద్యావిహార్ పాఠశాలలో..

గోదావరిఖనిటౌన్: గోదావరిఖని మార్కండేయ కాలనీలోని వాణి విద్యావిహార్ పాఠశాలలో 1998–99లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక మేదరి బస్తీలోని శ్రీనివాస్ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

రోడ్డుపై మట్టికుప్ప.. తప్పని తిప్పలు



బస్‌షెల్టర్ పక్కనే మట్టి పోసిన నిర్మాణదారు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల రాజీవ్ రహదారి బస్‌షెల్టర్ పక్కనే నిర్మాణదారుడు పెద్ద మట్టి కుప్పపోయడంతో వాహనదారులు, బస్‌షెల్టర్‌లో కూర్చునే వారు ఇబ్బంది పడుతున్నారు. సర్వీసు రోడ్డు లేకపోవడంతో ఈదారి గుండా చాలా మంది కృష్ణానగర్‌కు వెళ్తుంటారు. మట్టి కుప్పలు ఉండడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. 4నెలల క్రితం ఇదే ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ ఒక కాలును కోల్పోయిన విషయం తెలిసిందే. మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు చొరవచూపాలని కోరుతున్నారు.

నిఘా నేత్రాలు.. నిర్వహణ కరువు



గుండారం బస్టాప్ వద్ద వంగిన సీసీ కెమెరా ఉన్న స్తంభం

కమాన్‌పూర్: మండలంలోని మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు (సీసీ కెమెరాల)పై నిఘా కరువైంది. గతంలో రహదారిపై కమాన్‌పూర్ పోలీసులు కమాన్‌పూర్ ఎక్స్ రోడ్డు, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారి, గుండారం బస్‌స్టాప్‌ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. గతంలో పలు ప్రమాదాలకు కారణమైన వాహనాలను సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించి పట్టుకున్న సంఘటలున్నాయి. ప్రస్తుతం గుండారం బస్‌స్టాప్ వద్ద ఇనుప స్తంభానికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కాగా స్తంభాన్ని కొన్నినెలల క్రితం గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో స్తంభం వంగిపోయింది. కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారి వద్ద ఉన్న సీసీ కెమెరాలకు చెట్లకొమ్మలు అడ్డుగా ఉన్నాయి. దీంతో దారిపై వెళ్లే వాహనాలు సీసీ ఫుటేజీకి అడ్డుగా ఉన్నాయి. ఇప్పటికైనా పోలీసులు నిఘా నేత్రాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

హనుమాన్ మాలధారుల భజన



భజన చేస్తున్న హనుమాన్ దీక్షాస్వాములు

సుల్తానాబాద్: పట్టణంలోని శాస్త్రినగర్ హనుమాన్ ఆలయంలో, శివాలయంలో ఉన్న హనుమాన్ ఆలయంలో హనుమాన్ దీక్షాస్వాములు భజన నిర్వహించారు. ఆదివారం హనుమాన్ విగ్రహాలకు చందనం అద్దడంతోపాటు తమలపాకుల దండలు ధరింపజేశారు. అనంతరం భజన, సంకీర్తనలు ఆలయాల్లో మారుమోగాయి.

చింత చిగురు కిలో రూ.600

జ్యోతినగర్: చింత చిగురుకు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. ఆదివారం ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్‌లోని వారసంతలో కిలో రూ. 600 వరకు విక్రయిస్తున్నారు. 50 గ్రాముల నుంచి 100 గ్రాముల చొప్పున విక్రయిస్తున్నారు. ఏటా వేసవి కాలం ముగుస్తున్న సమయంలో చింత చెట్లు చిగురిస్తాయి. ఈ క్రమంలో లేత ఆకులను కోసి విక్రయిస్తుంటారు. పలు వంటకాల్లో చింత చిగురును వినియోగిస్తారు. కొంతమంది చింత చిగురును విదేశాల్లోని బంధువులకు సైతం కొరియర్ ద్వారా పంపిస్తున్నారు. గతేడాది రూ.400కు కిలో ఉండగా ప్రస్తుతం రూ.600కు పెరిగింది. రామగుండం మండలంలోని పరిసర గ్రామాలకు చెందిన కొందరు కూరగాయల విక్రయదారులు చింతచిగురు సేకరించి ఎన్టీపీసీ రామగుండం వారసంతలో విక్రయిస్తున్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



బాండ్ పేపర్ అందజేస్తున్న స్నేహితులు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ మండలం నర్సయ్యపల్లి గ్రామానికి చెందిన మద్దెల తిరుపతి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా 2000–01లో పదో తరగతి చదివిన బ్యాచ్ స్నేహితులు రూ.40,500తో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి ఆ బాండ్ పేపర్‌ను ఆదివారం కుటుంబానికి అందజేశారు. స్నేహితులు కుందేళ్ల శ్రీనివాస్, సిద్దు, ఈశ్వరోజు శ్రావణ్, దీకొండ శ్రీనివాస్, మూల శ్రీనివాస్, సంతోష్, రమేశ్, నరేశ్ ఉన్నారు.